# పంటి క్రింద రాయి


విక్రమరావ్ ఆస్టిన్‌లో ఆఫీస్ పని పూర్తి చేసుకుని, ఎయిర్‌పోర్ట్‌కి వచ్చేసరికి, సాయంత్రం అయిదున్నర గంటలయింది. మామూలుగా అయితే హ్యూస్టన్ నించీ ఆస్టిన్‌కి - నూట డెబ్భయి మైళ్లే కనుక - డ్రైయివ్ చేసుకు వెళతాడు. కానీ ఆ నెలలో కారు ప్రయాణాలు మరీ ఎక్కువ అవటం వల్ల, ప్రొద్దున్న ప్లైయిట్‌లో ఆస్టిన్ వచ్చాడు. లంచ్ టైమ్‌లో మిత్రుడు నారాయణతో ఒక గంట కాలక్షేపం. అప్పుడే అతను చెప్పిన విషయం ఉత్సాహంగా విన్నాడు. ప్లేన్‌లో ఎక్కాక కూడా అదే విషయం గురించి ఆలోచిస్తున్నాడు.

తనకి సీటు నెంబరు 23 ఎఫ్ ఇచ్చారు. అంటే విమానం రెక్క మీద అన్నమాట. ఆస్టిన్ నించీ హ్యూస్టన్‌కి అరగంట ప్రయాణం కనుక, విమానం ఎక్కువ ఎత్తు కూడా వెళ్లదు. 12 వేల అడుగుల ఎత్తులో వెళుతుంది. దూర ప్రయాణాల్లో అయితే 30 వేల అడుగుల పైన వెళుతుంది.



విమానం పైకి లేవగానే, విక్రమరావ్ సీట్లో వెనక్కి జారగిలపడి, నారాయణ చెప్పిన విషయమే ఆలోచిస్తున్నాడు.

నారాయణ ఆస్టిన్‌లో ఒక ప్రముఖ కంప్యూటర్ కంపెనీలో పని చేస్తున్నాడు. అతనికి ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశాక, ఇరవై ఏళ్ల అనుభవం కూడా వుంది. కానీ ఈ కంపెనీలో నాలుగేళ్ల నించీ సీనియర్ ఇంజనీర్‌గానే వున్నాడు. మేనేజర్‌గా వేరే కంపెనీల్లో అనుభవం వున్నా, అతనికి ఆ ఉద్యోగం మాత్రం ఇవ్వలేదు. కానీ అతను చేసే పని చాలా ఛాలెంజింగ్‌గా వున్నా, క్రొత్త ప్రొడక్ట్‌ల డెవలప్‌మెంటుని, చాల తెలివితేటలతో చేస్తున్నాడు. కంపెనీ వైస్ ప్రెసిడెంట్ నించి ఒకసారి ధనరూపేణా బహుమతి కూడా వచ్చింది. అయినా తనకన్నా తక్కువ అనుభవం వున్నవాళ్లు, తెల్లవాళ్లూ, కాలేజీ నించి బయటపడిన మూడు - నాలుగేళ్లకే, ఏమీ సరుకు లేకపోయినా, మేనేజర్లు అయిపోవటం, అతనికి బాధగానే వుంది.



నారాయణ సంగతి ఒక్కటే కాదు, విదేశాల నించి వచ్చి అమెరికన్ పౌరసత్వం తీసుకున్న చాలమంది కథ యిలాగే వుంటుంది, చాలా కంపెనీల్లో. ముఖ్యంగా ఇండియా, పాకిస్తాన్, చైనా, మెక్సికో లాటి దేశాల నించి వచ్చినవాళ్లు ఎంతగా కంట్రిబ్యూట్ చేసినా, ఒక లెవెల్ దాటి పైకి వెళ్లలేరు. మనవాళ్లు చాలమంది, ఎక్కువగా ఈ విషయం ఆఫీస్‌లో మాట్లాడితే, మొదటికే మోసం వస్తుందని - కిక్కురుమనకుండా వూరుకుని, తమ పనిలో మాత్రం ఏ తప్పులు జరుగకుండా జాగ్రత్తపడుతుంటారు. కానీ నారాయణ అలా చేయలేదు. అదే ఆశ్చర్యంగా వుంది విక్రమరావ్‌కు.

“ఏమిటయ్యా ఆలోచిస్తున్నావ్!” బేతాళుడి గొంతు వినపడింది విక్రమరావ్‌కి.

అతను వులిక్కిపడి చుట్టూ చూశాడు. తన చుట్టుప్రక్కల నాలుగైదు వరసల్లో, సీట్లు అన్నీ ఖాళీగానే వున్నాయి. ఎవరూ లేరు.

“ఇక్కడ - బయట!” అన్నాడు బేతాళుడు - విమానం కిటికీ తలుపు మీద చేత్తో తడుతూ.

విక్రమరావ్ అదిరిపడ్డాడు - బయట విమానం రెక్క మీద కూర్చుని వున్న బేతాళుడ్ని చూసి.

“భయపడకు - నేనే. ఏమీ తోచక, ఇందాక నీ కోసం వెతుక్కుంటూ మీ ఇంటికి వెళ్లేను. మీ ఆవిడా, మీ అమ్మాయి మాట్లాడుకుంటుంటే విన్నాను. నువ్వు ఈ ఫ్లైట్లో ఆస్టిన్ నించీ వస్తున్నావని - అందుకే వచ్చాను కాలక్షేపం కోసం”.

విక్రమరావ్‌కి ఒళ్లు గగుర్పొడిచింది - ఎంత భేతాళుడయినా అంత వేగంగా పోయే విమానం రెక్క మీద, బయట, భూమికి పన్నెండు వేల అడుగుల ఎత్తున... అలా.... అందుకే

---

పంటి క్రింద రాయి

అన్నాడు - "భేతాళుడూ - ఏమిటి నువ్వు చేస్తున్న పని - లోపలికిరా..." అని.

బేతాళుడు నవ్వాడు - "నా వల్ల విమానానికి ఏదన్నా ప్రమాదం అవుతుందని భయంగా వుందా - ఏమీ అవదులే - నా బరువు ఇప్పుడు సున్నా కేజీలు -".

"నా భయం అదికాదు - నీకేమన్నా అవుతుందేమోనని... ముందు లోపలికిరా..." అన్నాడు విక్రమరావ్, తన ఆందోళన బయటకు కనపడనీయకుండా.

బేతాళుడు అక్కడ మాయమయి, విక్రమరావ్ ప్రక్క సీటులో ప్రత్యక్షమయ్యాడు. హోస్టెస్‌లు ఇద్దరు అమ్మాయిలు, డ్రింక్స్ బండి త్రోసుకుంటూ వస్తున్నారు.

విక్రమరావ్ మనసులోని ఆలోచనను తెలుసుకుని అన్నాడు బేతాళుడు.

"నా గురించి నువ్వు దిగులుపడకు - నేను వాళ్లకు కనపడను. అంతేకాదు ఈ కథ పూర్తయేదాకా, నువ్వు నాతో మాట్లాడుతున్నా, వాళ్లకు ఏమీ తెలీకుండా చేస్తాను. కానీ కాఫీ మాత్రం రెండు గ్లాసులు తీసుకో-".

ఎయిర్ హోస్టెస్ అడిగింది - "మీరు ఏమి త్రాగాలనుకుంటున్నారు?" అని.

"కాఫీ - విత్ క్రీమ్ అండ్ షుగర్ -" అన్నాడు విక్రమరావ్.

"కాఫీ నేటెడ్ కావాలా - డీ కాఫీనేటెడ్ కావాలా?" అని అడిగింది ఆ అమ్మాయి.

"డీ కాఫీ నేటెడ్ - రెండు కప్పులు యివ్వండి -" అన్నాడు విక్రమరావ్.

ఆ అమ్మాయి అతని కళ్లల్లోకోసారి చూసి, చిరునవ్వి, రెండు కప్పులు అక్కడ పెట్టి బండి త్రోసుకుంటూ వెళ్లిపోయింది.

బేతాళుడు కాఫీ త్రాగుతూ అన్నాడు - "ఆఫీసుల్లో డిస్క్రిమినేషన్ గురించి ఆలోచిస్తున్నావ్ నువ్వు - మనం పోయినసారి 'సొగసు చూడతరమా' కథలో కదూ అనుకున్నాం - వచ్చే కథలో అన్యాయానికి గురి అయిన ఉద్యోగస్తులు కంపెనీల మీద కోర్టుకి వెళితే ఏమవుతుందో చెప్పుకుందామని".

"ఆఁ! అవును గుర్తుకొచ్చింది. 'పంటి క్రింద రాయి' గురించి కూడా చెప్పుకున్నాం"- అన్నాడు విక్రమరావ్.

"సరే - చెప్పు నీ కథ - వింటాను" అన్నాడు బేతాళుడు.

"నేను మధ్యాహ్నం నారాయణని కలిసాను. నీకు తెలుసుకదూ అతని గురించి".

"అవును రెండు నెలల క్రితం అతను హ్యూస్టన్‌లో మీ ఇంట్లో నీతో మాట్లాడు తుంటే ప్రక్కనే డైనింగ్ టేబుల్ మీద, మీకు కనపడకుండా కూర్చుని అంతా విన్నాను. అతను ముప్పయి రెండు గిగాబైట్ల స్కసీ డ్రైవుల ఫైల్ సర్వర్ డెవలప్‌మెంటుకి లీడ్ ప్రాజెక్ట్ ఇంజనీర్ అనీ, ఆ ప్రాజెక్ట్ పూర్తి చేయటానికి అతనికి సంవత్సరం టైము యిస్తే, తొమ్మిది నెలలలోనే పూర్తిచేశాడని చెప్పాడు -" బేతాళుడు అన్నాడు.

విక్రమరావ్ ఆశ్చర్యపడ్డాడు - "ఓరి నీ దుంపతెగా - నీకు అన్నీ గుర్తున్నాయే - అవును - అతనే! ఆ ప్రాజెక్ట్ అలా పూర్తిచేసి, చాలా మెప్పు పొందాడు. కానీ తర్వాత జరిగింది అందుకు పూర్తిగా విరుద్ధం".

"ఏం ప్రమోషన్ రాలేదా?" అడిగాడు బేతాళుడు.

"ప్రమోషన్ రావటం కాదు - ఉద్యోగం పోయింది -" - ఒక్క క్షణం ఆగాడు విక్రమరావ్. సాలోచనగా అన్నాడు - "గమ్మత్తేమిటంటే, ఉద్యోగం పోయిన ఆ రోజు, అతనికి చాలా మంచి రోజు కూడాను. ఆ రోజు కంపెనీలోని పెద్ద వాళ్లందరి ముందు ఒక ప్రెజంటేషన్ అయింది. నారాయణ ఒక వర్కింగ్ మోడల్ కూడా తయారుచేసి చూపించాడు. ఇంజనీర్లు, మానేజర్లు, మార్కెటింగ్ వాళ్లు, అందరూ మెచ్చుకున్నారు, చాలా మంచి ప్రాడక్ట్ అని. ఆ మీటింగ్ నించి వచ్చి, మీటింగ్ మినిట్స్ కంప్యూటర్ మీద టైపు చేస్తున్నాడు నారాయణ. అప్పుడే వచ్చాడు ఆ కంపెనీ ఇంజనీరింగ్ డైరెక్టర్ జార్జి - వచ్చి తలుపు దగ్గరకు వేశాడు.

"నీకొక అశుభవార్త చెప్పటానికి చాల విచారిస్తున్నాను!" అన్నాడు - అతని మొఖం చూస్తే, విచారిస్తున్నట్టుగా మాత్రం లేదు.

నారాయణకి ఏమీ అర్థం కాలేదు - ప్రాజెక్ట్ కాన్సిల్ అయిందా - అయే అవకాశం లేదే - మరి ఏమయుండాలి?

జార్జి అన్నాడు సూటిగా - "పోయిన క్వార్టర్‌లో మన కంపెనీకి అనుకున్నంతగా లాభాలు రాలేదు. నీకు తెలుసు మన కంపెనీ స్టాకు కూడా ముప్పయి శాతం క్రిందకు పడిపోయిందని. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఒకటే గోల - ఈసారి లాభాలు చూపించకపోతే - మనకీ, మన స్టాఫ్‌కీ పుట్టగతులుండవని - అందుకే మన కంపెనీలో కొంతమందిని తీసేద్దామని నిర్ణయించుకున్నాం - మన గ్రూప్‌లో తీసివేయవలసిన వాళ్ళలో, దురదృష్టవశాత్తూ నీ పేరు కూడా వుంది".

నారాయణ అదిరిపడ్డాడు. "అదేమిటి - మన ప్రాజెక్ట్ అనుకున్న దానికన్నా చాల ముందరే పూర్తిచేశాం కదా - అందులోనూ - చాల గొప్పగా..." అన్నాడు కూడబలుక్కుని.

"అవును! కంగ్రాట్యులేషన్స్!! వెరీగుడ్ జాబ్!!! నీ తెలివితేటలుగానీ, కార్య నిర్వహణ శక్తి గానీ, సాంకేతిక జ్ఞానం కానీ మేమెవ్వరమూ శంకించటం లేదు. నా మనసులో మాట ఏమిటంటే, నువ్వు చాల గొప్ప ఇంజనీరువి. నువ్వు వెళ్లిపోతున్నందువల్ల, మా కంపెనీ చాల నష్టపోతున్నది. అయినా నా చేతుల్లో ఏమీ లేదు. మీ ప్రాజెక్ట్ అయిపోయినందువల్లా, వేరే యింకో ప్రాజెక్ట్ లేనందువల్లా, నీ ఉద్యోగం పోవలసి వచ్చింది -".

నారాయణ అన్నాడు - "నన్ను యింకో డిపార్టుమెంటుకి బదిలీ చేయొచ్చు కదా - పని చేయనివాళ్లు, ఈ కంపెనీలో చాలా మంది వున్నారు. వాళ్లని యింటికి పంపించి, నన్ను వాళ్ల ఉద్యోగం వేయవచ్చు కదా!"

"అవన్నీ చేస్తూనే వున్నాం - కానీ నీ విషయంలో చేయలేక పోతున్నాం -" జార్జి అన్నాడు.

"అయితే ఈ కంపెనీలో, నా చివరి రోజు ఎప్పుడు?" అడిగాడు నారాయణ.

"మనం యిద్దరం స్నేహితులలాగా విడిపోవటానికి నిశ్చయించుకున్నాక, ఇక ఆలస్యం దేనికి - ఇప్పుడే!" అన్నాడు జార్జి, టైము చూస్తూ. మధ్యాహ్నం మూడు గంటలయింది.

"ఇప్పుడా - రెండు వారాల నోటీస్ యివ్వరా? రెండు నెలల జీతం యివ్వరా - నా. మెడికల్ ఇన్సూరెన్స్ ఏమవుతుంది? నేను చేస్తున్న పని మధ్యలో ఆపేస్తే..."

జేన్ అన్నది అప్పుడే లోపలకు వస్తూ - "అవన్నీ మేము చూసుకుంటాం లెండి - రెండు వారాల నోటీస్ కానీ, రెండు నెలల జీతం కానీ యిచ్చే పద్ధతి లేదు యిక్కడ - ఈ కాగితంలో, మిమ్మల్ని ఉద్యోగంలో నించి తీసివేయటానికి కారణం ప్రాజెక్ట్‌లు లేకపోవటమే కానీ, యింకే విధమైన అన్యాయసమ్మతమైన కారణాల వల్ల కాదనీ, మీరు తర్వాత ఏనాటికీ మామీద ఏ విధమైన చర్యలు తీసుకోమనీ వ్రాసి వుంది. దీని మీద మీరు సంతకం పెడితే, రెండు వారాల జీతం యిస్తాం. లేకపోతే అదీ లేదు. మెడికల్ ఇన్సూరెన్స్‌కి 'కోబ్రా' అని ఒక ప్లాను వుంది. మీరు కట్టే ప్రీమియంకి రెండింతలు కడితే, మూడు నెలల ఇన్సూరెన్స్ యిస్తాం -" జేన్ ఒక కాగితం అందించింది. ఆవిడ 'హ్యూమన్ రిసోర్సిస్' డిపార్ట్‌మెంటుకి డైరెక్టర్.

ఈలోగా జార్జి, ఒక నాలుగు అట్టపెట్టెలు తెచ్చి అక్కడ పెట్టి, "నీ స్వంత సామాన్లు సర్దుకో - పార్కింగ్ లాట్ దాకా తోడు వస్తాను" అన్నాడు.

నారాయణకి కాళ్ళ క్రింద భూమి పగిలిపోయి, అగాధంలోకి జారిపోతున్నట్టుగా భావన కలిగింది. అయినా నిలద్రొక్కుకున్నాడు. ఒక అరక్షణం ఆలోచించాడు. జేన్ యిచ్చిన కాగితాన్ని, బ్రీఫ్‌కేస్‌లో పడేసి, "ఇప్పుడు సంతకం పెట్టను - దీని గురించి ఆలోచించాలి - రేపు ఫోన్ చేస్తాను నీకు!" అన్నాడు.

"జార్జ్ - పార్కింగ్ లాట్ ఎక్కడ వుందో నాకు తెలుసు - నీకు ఎందుకు శ్రమ!" అన్నాడు, కర్నాటక సంగీత కచ్చేరీలో ప్రక్క వాయిద్యం ఘటంలాగా వున్న జార్జి పొట్ట మీద, చేత్తో నెమ్మదిగా కొట్టి.

"నాకేమీ శ్రమ లేదు - నీలాటి మంచి ఇంజనీర్‌కి వీడ్కోలు యివ్వటానికి వద్దామని - అంతే!" అంటూనే షెల్ఫ్‌లో వున్న నారాయణ పుస్తకాలు అట్టపెట్టెల్లోకి సర్దటం మొదలెట్టాడు.

తర్వాత అయిదు నిమిషాల్లో నారాయణ కారు పార్కింగ్ లాట్‌లో నించి బయటకు వచ్చింది. ఇంటికి వచ్చి, విషయం చెబుతే నిర్మల నమ్మలేదు. "జోకులు వేయకండి!" అన్నది. కారు డిక్కీలోని అట్టపెట్టెలు చూస్తేగాని నమ్మకం కలుగలేదు.

నారాయణ షవర్‌లో చల్లటి నీళ్లతో తలస్నానం చేస్తూ - ఒక నిర్ణయానికి వచ్చాడు - 'వీళ్లను ఇంతటితో వదలను' అని.

మర్నాడు దాదాపు నాలుగు గంటల సేపు, ఫోన్‌లో చాలా మందితో మాట్లాడాడు. కాగితం మీద కొన్ని పేర్లు, టెలిఫోన్ నెంబర్లు వ్రాశాడు.

నిర్మలతో అన్నాడు - "మా కంపెనీలో ఎవరెవర్ని తీసేశారో చూశావా - మహమ్మద్ పాకిస్థానీ అతను - అష్రఫ్ ఇరాన్ అతను. ఎడ్డీ నల్లవాడు. నేను ఇండియన్ని. రాన్ అరవయి ఏళ్లవాడు, షర్లీ నల్లమ్మాయి, మారియో కొలంబియా అతను..." - లిస్ట్‌లో వున్న మిగతా పేర్లు చదివాడు. "ఈ కంపెనీలో ఇలాటివి నాలుగేళ్ల నించీ జరుగుతూనే వున్నాయి. కాకపోతే నాదాకా రాలేదు కనుక, నాకు ఏమీ బాధ కలుగలేదు..... ఇప్పుడు మాత్రం వీళ్లను..... వదలను!" అన్నాడు.

"మనకెందుకండీ లేనిపోని గొడవ - వేరే యింకో కంపెనీలో ప్రయత్నం చేయ కూడదూ..." నిర్మల అన్నది.

"తప్పకుండా ప్రయత్నం చేస్తాను. అంతేకాదు నెల రోజుల్లో వేరే కంపెనీలో ఉద్యోగం సంపాదిస్తాను. కానీ, ఈ దురభిమానపు వెధవల్ని మాత్రం వదలను" దృఢంగా అన్నాడు.

"అందరూ వూరుకుంటున్నప్పుడు - మీకెందుకు లేనిపోని తలనొప్పి -" అన్నది నిర్మల.

"నిర్మలా! - అలా అని నన్ను నిరుత్సాహపరచకు. నాకు చేయూతనియ్యి. ఐ లవ్ యు. ఐ నీడ్ స్ట్రెంగ్త్. మిగతావి నేను చూసుకుంటాను. ఏ విషయమయినా, మంచి కానీ, చెడు కానీ, ఎక్కడో ఒకచోట, ఏదో ఒక్క మనిషి ద్వారానే మొదలయేది. అంతేకాదు నా జీవితంలో జరిగే మంచికి కానీ, చెడుకు కానీ నేనే బాధ్యత వహించాలి. ఇంకెవరో వచ్చి, మన కష్టాలకు పరిహారం యిస్తారని నేను అనుకోను. అందుకని, నాకు జరిగిన ఈ అన్యాయానికి పరిహారం నాతోనే మొదలవుతుంది -" అన్నాడు నారాయణ.

బేతాళుడు, విక్రమరావ్‌ని ఆపి అన్నాడు - "నీ కథలో, మరీ నాటకీయత ఎక్కువ వున్నట్టుందయ్యా!"

"నారాయణ తన నోటితో చెప్పిన కథ నీకు వినిపిస్తున్నాను. అంతే! అయినా అతనికి కడుపుమండి, జరిగింది జరిగినట్టు చెబితే, నాటకీయత ఏమిటి - నీ బొంద - పూర్తిగా విను!" విక్రమరావ్‌కి చిరుకోపం వచ్చింది.

కాఫీ యింకొక గుక్క తాగి, చెప్పటం కొనసాగించాడు విక్రమరావ్.

"నారాయణ తన లిస్ట్‌లో వున్నవాళ్లందర్నీ పిలిచాడు - 'సాయంత్రం నాలుగు గంటలకు - జిమ్స్ రెస్టారెంటుకి రండి. కలిసి కాఫీ త్రాగుదాం' అని. అంతమందిని పిలిచినా, అక్కడకు వచ్చింది నారాయణతో కాక నలుగురు -"

"నలుగురితో నారాయణ అన్నమాట" నవ్వుతూ అన్నాడు బేతాళుడు.

"సీరియస్ కథ చెబుతున్నప్పుడు చచ్చు జోకులు వేయకు. అక్కడకు వచ్చింది అష్రఫ్, ఎడ్డీ, రాన్, షర్లీ. నారాయణ వాళ్లతో అన్నాడు - అమెరికన్ గవర్నమెంటు లా ప్రకారం, మిగతా దేశాల నించి వచ్చిన వాళ్లని, నల్లవాళ్లనీ, ఆడవాళ్లనీ, ఏభయి ఏళ్లు వయస్సు దాటిన వాళ్లనీ డిస్క్రిమినేట్ చేయటం చట్టరీత్యా నేరం. అష్రఫ్, నేనూ, వేరే దేశాల నించి వచ్చిన వాళ్లం. ఎడ్డీ, షర్లీ నల్లవాళ్లు. షర్లీ అమ్మాయి. రాన్ అరవయి ఏళ్లవాడు. అంటే మనల్ని ఉద్యోగాల నించి తీసివేసి మన కంపెనీ చట్టరీత్యా నేరం చేసింది. మనలో అందరికీ, ఈ కంపెనీలో, చక్కగా పనిచేసినట్టు రికార్డు వుంది. మనల్ని తీసేసి, మనకన్నా తక్కువ అనుభవం వున్న తెల్ల జ్యూయిష్ వాళ్లకు మన ఉద్యోగాలు యిచ్చారు. కనుక మనం కోర్టుకి వెళ్లటం అవసరం. మీకు యిష్టమయితే, నాతో కలవండి. కలసి పోట్లాడదాం!" అన్నాడు.

చాలాసేపు తర్జన భర్జనలు అయాక అందరూ ఒప్పుకున్నారు.

రాన్ అన్నాడు - "నాకు తెలిసిన లాయర్ ఒకావిడ వుంది - ఆవిడ ఇలాటి విషయాల్లో దిట్ట. కాకపోతే గంటకు నూటయాభై డాలర్లు వసూలు చేస్తుంది".

"డబ్బు ఖర్చని వూరుకుంటే లాభం లేదు - రాన్! ఆవిడ ఫోన్ నెంబరూ, అడ్రసూ నాకు యివ్వగలవా? ఇదిగో నా వంద డాలర్లు - నాతో కలవటానికి యిష్టమైన వాళ్లందరూ ఇక్కడ డబ్బులు పెట్టండి -" అన్నాడు నారాయణ టేబుల్ మీద వంద డాలర్లు పడేస్తూ.

రాన్, అష్రఫ్, షెర్లీ తలో వందా పడేశారు. ఎడ్డీ మాత్రం, "అసలే ఉద్యోగం పోయింది - ఈ పోరాటానికి ఇంకా ఎన్ని వందలు అవుతాయో - నా దగ్గర అంత డబ్బూ, ఓపికా లేవు. నేను వాళ్లడిగిన కాగితం మీద సంతకం పెట్టి, కనీసం ఆ రెండు వారాల జీతం అయినా తీసుకుంటాను!" అంటూ లేచాడు.

"కాఫీకి ఎంతివ్వాలి నా వంతు?" అన్నాడు ఎడ్డీ.

"నే యిస్తాలే నీవంతు కూడా - హావ్ ఎ గుడ్ డే" అన్నాడు నారాయణ.

లాయర్‌తో అపాయింట్‌మెంట్ కుదుర్చుకుని, మర్నాడు నలుగురూ ఆవిడ్ని కలిశారు. కథ అంతా విని ఆవిడ అన్నది - "అవును - మీ అందరికీ మంచి కేసు వుంది. మీ అందరి పెర్ఫార్మన్స్ కంపెనీ రికార్డుల్లో వుంది కనుక, మిమ్మల్ని 'పనికిరాని వాళ్లని' తీసివేయటానికి వీలులేదు. కాకపోతే ఒక విషయం. ఇలాంటి వ్యవహారాల్లో, ఈ కేసులు తేలటానికి ఎన్నాళ్లు పడుతుందో చెప్పటం కష్టం. మీ అదృష్టం బాగుంటే మూడు నెలల్లో అవవచ్చు. లేదా మూడు సంవత్సరాల పైన పట్టవచ్చు. ముఖ్యంగా, ఆ కంపెనీ ఈ కేసుని, ఎటు ప్రక్కనించీ నరుక్కు వస్తుందో దాన్నిబట్టి వుంటుంది అంతా. మరి మీకు ఈ కేసు తేలేదాకా నిలద్రొక్కుకునే మానసిక ధైర్యం, ఆర్థిక స్తోమతా, సమయం వున్నాయా?"

అందరూ ఒక్క క్షణం ఆలోచించారు.

"ఆరు నూరయినా, నూరు ఆరయినా నేను మాత్రం పట్టు వదలను!" అన్నాడు నారాయణ. మిగతా ముగ్గురూ కూడా చేతులు కలిపారు.

ఆవిడ నవ్వింది - "మీలా అందరూ వుంటే, ఇలాటి అన్యాయాలు జరగటం అరుదయిపోతుంది. - ఒక పని చేద్దాం. ముందుగా మనం కోర్టుకి వెళ్లవద్దు - మీ ఒక్కొక్కళ్ల పేరునా, పకడ్బందీగా కేసు తయారుచేసి, మీ కంపెనీకి లాయర్ నోటీసు పంపిద్దాం. వాళ్ల జవాబు, రియాక్షన్ చూసి, తదుపరి కార్యక్రమం నిర్ణయిద్దాం" అన్నదావిడ.

ఆవిడ సలహా అందరికీ నచ్చింది.

అందర్నీ చాలా ప్రశ్నలడిగి, నోట్స్ వ్రాసుకుంది ఆవిడ.

"రేపు మీరందరూ ఒకసారి రండి - నోటీసులు తయారుచేసి వుంచుతాను. మీరు చూశాక పోస్ట్ చేద్దాం!" అన్నది.

నారాయణ యింటికి రాగానే నిర్మల అన్నది - "మీ ఆఫీస్ నించీ జేన్ పిలిచింది - నిన్ను పిలవమన్నది".

నారాయణ నవ్వాడు - "నీకు ఈ జేన్ సంగతి ఇంతకుముందే చెప్పాను. గుర్తుందా? నేను ఈ కంపెనీలో చేరిన మొదటి వారంలోనే ఒక సంఘటన జరిగింది. నేనూ, ఆవిడా, యింకా కొంతమందితో కలిసి, కాఫిటేరియాలో లంచ్ తింటున్నాం. 'మీ ఇండియన్స్ లంచ్ చేత్తో తింటారుట కదా... అదేమిటి... అసహ్యంగా!' అని అడిగింది. 'మీరు హేమ్బర్గర్లూ, పిజ్జా చేత్తో తినటంలే - అలాగే - అసహ్యంగా' అన్నాను నేను. అప్పటినించీ నేనంటే అదోలా చూస్తుందావిడ" అంటూనే జేన్‌కి ఫోన్ చేశాడు నారాయణ.

"నేనిచ్చిన కాగితం మీద సంతకం పెట్టావా? - పెడితే పంపించు - రెండు వారాల జీతం యిస్తాను!" అన్నది.

"పెట్టలేదు. పెట్టను. పంపించలేదు. పంపించను. మళ్లీ పిలు - నీకు పిలవాలని పిస్తే!" అని ఫోన్ పెట్టేశాడు.

రెండు రోజుల తర్వాత - నోటీసు అందగానే, జేన్ పిలిచింది. చాల మర్యాదగా మాట్లాడింది - "నా ఆఫీసుకి రాగలరా - మీతో మాట్లాడాలి" అన్నది.

"ఎప్పుడు రమ్మంటారు?" అనడిగితే - "మీకు ఎప్పుడు వీలయితే అప్పుడు!" అన్నది.

ఆవిడతో అనుకున్నట్టుగా మర్నాడు కలిశాడు. ఆవిడ ఒక అగ్రిమెంటు అందించింది. కంపెనీని అన్ని లావాదేవాల నించీ విడుదల చేస్తూ, సంతకం పెడితే, నెల రోజుల జీతం యిస్తామని.

నారాయణ నవ్వాడు, "మా లాయర్‌తో మాట్లాడు" అని వచ్చేశాడు.

మర్నాడు జేన్ మళ్లీ పిలిచింది.

"నేను కంపెనీ వైస్ ప్రెసిడెంట్‌తో మాట్లాడాను - ఆయనకు మీ గురించి బాగా తెలుసు. అందుకని మీకు మూడు నెలల జీతం యిమ్మన్నాడు. అన్ని కాగితాలు రెడీ చేశాను. వచ్చి సంతకం పెట్టి, చెక్ తీసుకు వెళ్లండి!" అన్నది.

నారాయణ, "నా లాయర్ ఫోన్ నెంబరు మీ దగ్గర లేనట్టుంది. కావాలా?" అని అడిగాడు.

షెర్లీ, రాన్, అష్రఫ్ పిలిస్తే తమకూ అలాగే ఫోన్ కాల్స్ వచ్చాయని తెలిపారు. రాన్ మూడు నెలల జీతాన్ని తీసుకుంటూ సంతకం పెట్టానని కూడా చెప్పాడు.

మూడు రోజుల తర్వాత జేన్ మళ్లీ పిలిచింది - "లేనిపోని కోర్టు గొడవలెందుకు - మాకూ తలనొప్పి, మీకూ తలనొప్పి. మధ్యలో లాయర్లు తినేస్తారు. మేము ఆరు నెలల



జీతం యిస్తాం. అవుటాఫ్ కోర్టు సెటిల్‌మెంట్ లాగా. ఈ కథను ఇంతటితో ఆపేద్దాం" అన్నది.

"అయితే కథ అయిపోయిందా?" అడిగాడు బేతాళుడు.

"అవలేదు - నారాయణ అవనీయలేదు. 'ఆనక' చూద్దాం అన్నాడు ఆవిడతో - తర్వాత మళ్లీ రెండు రోజులు ఏమీ జరగలేదు. జేన్ మళ్లీ పిలిచింది - "ఒక సంవత్సరం జీతం యిస్తాం, కథ పూర్తిచేస్తే" అన్నది.

నారాయణ షెర్లీనీ, అష్రఫ్‌నీ పిలిచాడు. షెర్లీ ఆరు నెలల జీతానికి ఒప్పుకుని సంతకం పెట్టింది. అష్రఫ్ సంవత్సరం జీతం తీసుకుందామనుకుంటున్నాడు. నారాయణ లాయర్‌కి ఫోన్ చేసి, ఆవిడ సలహా అడిగాడు.

"సంవత్సరం జీతం తీసుకుని - సంతకం పెట్టేయండి. ఎందుకంటే మీరు కోర్టుకి వెళితే, ఎన్నాళ్లు పడుతుందో చెప్పలేము. మూడు నాలుగు సంవత్సరాలు పట్టిన కేసులున్నాయి. వీళ్లు పిలచినప్పుడల్లా మీరు కోర్టుకి వెళ్లాలి. శెలవు పెట్టి. మానసికంగా చాలా ఇబ్బంది పెడుతుంది. అదీ కాక కోర్టు మీకు ఏ రెండు సంవత్సరాల జీతమో యిప్పిస్తే, దాంట్లో సగం లాయర్ ఖర్చులకీ, కోర్టు ఖర్చులకీ సరిపోతుంది. దానిబదులు, మీరు సంతకం పెట్టేసి డబ్బు తీసుకుంటే, కనీసం మనశ్శాంతి వుంటుంది" అని సలహా చెప్పింది.

నారాయణ సంతకం పెట్టేసి, చెక్ తెచ్చుకున్న రోజునే అదే వూళ్లో యింకొక కంపెనీ వాళ్లు ఇంటర్వ్యూ చేశారు. వారం రోజుల్లో, పిలిచి ఉద్యోగం కూడా యిచ్చారు!" అన్నాడు విక్రమరావ్.

విమానం హ్యూస్టన్ ఎయిర్‌పోర్టులో దిగింది. మెల్లగా గేట్ వేపు నడుస్తున్నది.

బేతాళుడు అన్నాడు - "ఇంతకీ నాదో ప్రశ్న - ఈ కథకీ, 'పంటి క్రింద రాయి'కీ ఏమిటి సంబంధం?" ఏమీ అర్థం కానట్టు తలగోక్కుంటూ.

విక్రమరావ్ నవ్వాడు - "నువ్వేం బేతాళుడివయ్యా - పంటిక్రింద రాయి నములు తున్నప్పుడు చాల యిబ్బంది పెడుతుంది. నమిలి మింగితే కడుపులో చేరి అల్లరి పెడుతుంది. తీసి బయట పారేస్తే, పీడ విరగడవుతుంది. అలాగే ఈ దురభిమానాన్నీ, డిస్క్రిమినేషన్‌నీ ఏరిపారేయాలి - నాకెందుకులే అని ఊరుకుంటే, పంటి క్రింద రాయిలాగా తయారవు తుంది!" అన్నాడు.

బేతాళుడు, రన్ వే మీదనించి, పైకి వెళ్లి ఆకాశంలో మాయమయాడు.

❖